సాక్షి
చిత్తూరు
బుధవారం । 27 । నవంబర్ । 2024



అంబేడ్కర్‌కు అవమానం

అంబేడ్కర్‌కు తీరని అవమానం జరుగుతుందని ఆల్ ఇండియా అంబేడ్కర్ సంఘం నేత గోవిందస్వామి ఆరోపించారు. - 8లో



ఇసుకింకరులపై సమర శంఖం

పలమనేరు మండలం మొరం చెరువులో ఇసుక తోడుతున్న అక్రమార్కులను ఆ గ్రామస్తులు అడ్డుకున్నారు. - 8లో



సంజీవని అయ్యేనా?

ప్రభుత్వాస్పత్రుల్లో సమస్యలను గుర్తించిన కలెక్టర్ వాటి పరిష్కారానికి ముందడుగు వేశారు. ఆ కృషి ఫలిస్తే వైద్యం మెరుగవుతుంది. - 8లో

న్యూస్‌రీల్

భావితరాల భవిత నిర్దేశకులు ఉపాధ్యాయులే!

– రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు



మొక్క నాటుతున్న రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు, కలెక్టర్ సుమిత్ కుమార్

గుడుపల్లె: భావితరాల భవిష్యత్తు నిర్దేశకులు ఉపాధ్యాయులేనని రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. మంగళవారం అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆడిటోరియంలో ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులకు నిర్వహించిన రీజినల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో ఆయన పాల్గొని, ప్రసంగించారు. విద్యతోనే ఆర్థిక సామాజిక స్థితిగతుల్లో మార్పులు ఉంటాయన్నారు. రేపటి తరానికి ఉత్తమ భవిష్యత్తు ఇచ్చేలా విద్యార్థులకు విలువలతో కూడిన బోధనను అందించాలన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణతోపాటు సన్మార్గంలో నడిచేలా ప్రాథమిక దశ నుంచి అలవాటు చేయాలన్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రయోగాత్మకమైన విద్యను అభ్యసించాలన్నారు. కాలనుగుణంగా సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించుకుని విలువలతో కూడిన విద్యను అందిచగలిగితేనే ఆ విద్యార్థి భవిష్యత్తు బాగుపడుతుందన్నారు. అనంతరం అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ హెడ్ సురేష్ విజ్ఞాన శాస్త్రంలో చేపట్టిన ప్రాజెక్టులు పరిశోధనలకు సంబంధించిన అంశాలపై పాఠశాల డైరెక్టర్ విజయరామరాజుకు, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌కు వివరించారు. ఆ తరువాత అగస్త్య ఫౌండేషన్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ఆర్జేడీ శామ్యూల్, డీఈఓ వరలక్ష్మి, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణరెడ్డి, కుప్పం ఆర్డీఓ శ్రీనివాసరాజు, తహసీల్దార్ సీతారాం, ఎంఈఓ శ్రీదేవి పాల్గొన్నారు.

108 సేవలు సజావుగా అందించండి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): 108 సేవల నడపడంలో ఎలాంటి ఇబ్బంది ఉండకూడదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతీదేవి అన్నారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో మంగళవారం ఆమె వైద్యశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. 108 సేవల అమలులో ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఎంఎల్‌హెచ్‌పీలను షిఫ్టుల వారీగా విభజించి అత్యవసర సేవలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. తాత్కాలికంగా వాహనాలను నడిపేందుకు డ్రైవర్లను సమకూర్చాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ కోర్డినేటర్ సుదర్శన్, 108 మేనేజర్ మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానలపై కార్మికులు, కర్షకులు, కదం తొక్కారు. సంపద సృష్టించే కార్మిక వర్గం.. దేశానికి వెన్నెముక అయిన అన్నదాతలకు జరిగే అన్యాయంపై గొంతెత్తి గర్జించారు. ఎన్నికల హామీలు అమలు.. నల్లచట్టాల రద్దులో ప్రభుత్వాల నిర్లక్ష్యంపై దండెత్తారు. రాజ్యాంగం రద్దు..మను ధర్మశాస్త్రం అమలు చేయాలన్న నిర్ణయంపై ధ్వజమెత్తారు. మొత్తంగా చిత్తూరు కలెక్టరేట్ మంగళవారం ధర్నాలతో దద్దరిల్లింది.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు, కార్మిక సంఘాల నాయకులు

కదం తొక్కిన కార్మిక, కర్షకలోకం

ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సమస్యలు పరిష్కరించడం లేదు
- ధ్వజమెత్తిన రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు
- రాజ్యాంగాన్ని కాపాడుకుందామంటూ పిలుపు

చిత్తూరు కలెక్టరేట్ : కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం నల్లచట్టాలను ఎందుకు రద్దు చేయడం లేదంటూ ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజన్ ప్రశ్నించారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద రాజ్యంగ దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్త పిలుపు మేరకు ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహించారు. ఈ ధర్నాలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ విధానాల్లో ఎలాంటి మార్పులు లేదని తెలిపారు. ఎన్డీఏలో భాగస్వామిగా ఉన్న టీడీపీ, జనసేన ప్రభుత్వాలు రాష్ట్రంలో కేంద్రం అమలు చేస్తున్న విధానాలే అమలు చేస్తున్నాయన్నారు. సర్వసంపదలు సృష్టించే కార్మిక వర్గం, ప్రజలకు తిండి పెట్టే రైతాంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్లకు, బడా పెట్టుబడి దారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ రైతులను, కార్మికులను మోసగిస్తున్నట్లు విమర్శించారు.

రాజ్యాంగాన్ని రద్దు చేస్తామనడం అన్యాయం

కేంద్రంలోని మతోన్మాద బీజేపీ రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని పార్లమెంట్ సాక్షిగా చెప్పడం అన్యాయమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు అన్నారు. 1949 నవంబర్ 26న రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసుకుని ఈ దేశంలో ఇప్పటి వరకు 75 సంవత్సరాలు అయ్యిందని, ఆ రాజ్యాంగాన్ని అనుసరించి ప్రతి ఒక్కరు పనిచేశారన్నారు. అలాంటి రాజ్యాంగాన్ని ప్రస్తుత బీజేపీ రద్దు చేసి మనుధర్మశాస్త్రాన్ని ప్రవేశపెడతామని చెప్పడం దారుణమన్నారు. ఈ సంవత్సరం బడ్జెట్‌లో 500 ప్రైవేట్ కంపెనీలకు యాజమాన్యం ఇవ్వాల్సిన జీతాలు కేంద్ర ప్రభుత్వమే ఇంటర్నషిప్‌తో కార్మికుడికి నెలకు రూ.5 వేలు ప్రోత్సాహాలు అమలు చేస్తామని చెప్పడం దారుణమన్నారు. కార్మికులకు నెలకు ఇవ్వాల్సిన రూ.26 వేల కనీస వేతనాలు ఇవ్వకుండా గత పది సంవత్సరాల నుంచి కనీస వేతనం ఏమాత్రం పెంచకపోవడం దుర్మార్గమన్నారు. సుప్రీం కోర్టు చెప్పిన స్కీం కార్మికులు, అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికులను కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఎంత కాలం పనిచేసినా పర్మనెంట్ చేయకూడదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించడం సిగ్గుచేటన్నారు.

ఉపాధి పథకానికి తూట్లు

ఉపాధి పథకానికి కేంద్రం తూట్లు పొడుస్తోందని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి సురేంద్రనాథ్ విమర్శించారు. లక్షలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా కేంద్రం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటీకరణ విధానాన్ని నిలిపివేయాలన్నారు. దుర్మార్గమైన లేబర్‌కోడ్‌లను వెంటనే రద్దు చేయాలన్నారు. స్కీమ్ వర్కర్లకు, పెన్షన్, గ్రాట్యుటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుల ఉత్పత్తులకు ఉత్పత్తి ఖర్చు కుటుంబ శ్రమ విలువతో పాటు మరో 50 శాతం కలిపి కనీస మద్దతు ధర ప్రకటించాలన్నారు. అధిక ధరలు తగ్గించి ప్రజలపై భారం పడకుండా చూడాలన్నారు. రాజ్యాంగ స్ఫూర్తితో దేశాన్ని కాపాడుకోవడానికి కార్మికులు రైతాంగం ప్రజలు మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం జేసీ విద్యాధరికి వినతిపత్రం అందజేశారు. నాయకులు దాసరి చంద్ర, జ్యోతి, కందుల మునిరత్నం నాయుడు, మణి, రమాదేవి, దామోదరం, మహేష్, రఘు, విజయగౌరీ, కుమారి, కవిత, కోమల, ప్రేమ, ప్రభావతి పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న నాగరాజన్

కార్మికులకు అన్యాయం



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తప్పనిసరిగా అమలు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం హామీలు అమలు చేయకపోగా కార్మికులపై కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తోంది. పలు శాఖల్లో పనిచేస్తున్న చిరుద్యోగులను ఉద్యోగాల నుంచి తొలగించి తమకు అనుకూలమైన కార్యకర్తలను ఉద్యోగాల్లో నియమించుకుంటుంది. కూటమి సర్కారు అమలు చేస్తున్న ధోరణిని మార్చుకోవాలి. – కవిత, కార్మికురాలు

కార్మికులు, రైతులకు న్యాయం చేయాలి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు, రైతులకు న్యాయం చేయాలి. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే కూటమి ప్రభుత్వం కార్మికుల పొట్టగొట్టేలా వ్యవహరిస్తూ పలువురిని ఉద్యోగాల నుంచి తొలగించింది. ఇలా చేయడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నిస్తున్నాం. అధికారంలోకి రాక ముందు ఒకలా, అధికారంలోకి వచ్చాక మరోలా వ్యవహరించడం ఎంత వరకు న్యాయమని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాం. కూటమి సర్కారు ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలి. – రమ, కార్మికురాలు

కేంద్ర వైఖరి మార్చుకోవాలి



కార్మికులు, రైతులపై వ్యవహరిస్తున్న వైఖరిని కేంద్రం మార్చుకోవాలి. రైతులకు, కార్మికులకు నష్టం కలిగేలా చట్టాలు అమలు చేయడం ఎంత వరకు సబబు. మేలు చేయాల్సిన కేంద్రం అన్ని వర్గాలకు అన్యాయం చేస్తోంది. ప్రజలకు తిండి పెట్టే రైతాంగానికి మోదీ సర్కారు ఎలాంటి మేలు చేయడం లేదు. ఇప్పటికైనా తీరు మార్చుకుని రైతులకు మేలు చేయాలి. – కుమారి, కార్మికురాలు

బడాబాబులకు రెడ్ కార్పెట్



కేంద్రం డబ్బున్న బడా బాబులకు రెడ్ కార్పెట్ వేస్తోంది. మోదీ సర్కారుకు రైతులు, ఇతర వర్గాల ప్రజలు కనిపించడం లేదు. బడాబాబులకు ప్రయోజనం కలిగేలా కేంద్రంలో పరిపాలన జరుగుతోంది. ఇలాంటి దుర్మార్గమైన పరిపాలన గతంలో ఎన్నడూ జరగలేదు. రైతులకు మేలు చేస్తే పది కాలాల పాటు చేసిన మేలు చెప్పుకుంటారన్న విషయాన్ని కేంద్రం మరిచిపోయింది. – ప్రభావతి, కార్మికురాలు

రాజ్యాంగాన్ని రద్దు.. అన్యాయం



గత 75 సంవత్సరాలుగా అనుసరిస్తున్న రాజ్యాంగాన్ని కేంద్రంలోని బీజేపీ సర్కారు రద్దు చేస్తామని పార్లమెంట్ సాక్షిగా చెప్పడం అన్యాయం. మనుధర్మశాస్త్రాన్ని ప్రవేశపెడుతామని చెప్పడం దుర్మార్గం. మోదీ సర్కారు పాలనను ప్రజలు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. ప్రజలకు మేలు చేయాల్సిన కేంద్రం విద్వేశాలు రెచ్చగొట్టేలా చూడడం సబబు కాదు. –జమీలాభి, కార్మికురాలు

నేటి యువత చదివింది కొంతే అయినా సూటు, బూటు వేసుకుని కొలువుకు వెళ్లాలనుకుంటారు. సేద్యం అంటే తక్కువగా భావిస్తారు. కానీ ఆయన రెండు పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులు చదివారు. ఉన్నత ఉద్యోగం పొందారు. అయినా అధ్యాపక వృత్తి వదలి.. పొలం బాట పట్టారు. సేంద్రియ సేద్యానికి శ్రీకారం చుట్టారు.. దేశవాళీ వరి వంగడాల సాగుపై మొగ్గు చూపి, వ్యవసాయంలోనూ పట్టభద్రుడయ్యారు. ఆ కర్షక పట్టభద్రుడే పలమనేరు మండలం కూర్మాయి గ్రామానికి చెందిన చందూల్ కుమార్‌రెడ్డి. ఆయన విజయగాథపై ప్రత్యేక కథనం.

కర్షక పట్టభద్రుడు



కూర్మాయిలో సాగు చేసిన దేశవాళి బ్లాక్‌రైస్ (ఇన్‌సెట్)చందూల్‌కుమార్ రెడ్డి

- కొలువును వదలి.. ప్రకృతి సేద్యంలో ప్రయోగాలు
- అంతరించిపోతున్న దేశవాళి వరి రకాల సాగు
- విషరహిత ఆహారోత్పత్తే ధ్యేయం
- ఇప్పటికే పలు రాష్ట్రాల్లో సన్మానాలు

పలమనేరు: పలమనేరు మండలంలోని కూర్మాయి గ్రామానికి చెందిన చందూల్ కుమార్‌రెడ్డి డబుల్ పీజీ చదివారు. సంస్కృత అధ్యాపకుడిగా రెండు దశాబ్దాలు పనిచేశారు. తన తల్లికి బీపీ, షుగర్ కారణంగా ఇబ్బంది పడుతుంటే దీనికి మూలమైన కారణాలను వెతికారు. మనిషి జీవనశైలి, ఆహారపు అలవాట్లే కారణమని గుర్తించారు. దీంతో పాలేకర్ శిష్యుడైన విజయరామ ప్రసంగాలతో ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి పెంచుకున్నారు. చేస్తున్న కొలువును వదలి మట్టితో స్నేహం చేయాలని భావించారు. దీంతో తనకు ఉన్న ఐదెకరాల పొలంలో కుటీరాన్ని నిర్మించుకుని అక్కడే ఉంటూ ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. ఇందుకోసం దేశంలో అంతరించిపోతున్న దేశవాళి వరి వంగడాలను సేకరించారు. వాటిని తన పొలంలో సాగు చేశారు. భవిష్యత్తు తరాలకు ఈ విత్తనాలను అందుబాటులోకి తేవాలనే సంకల్పంతో ముందుకెళుతున్నారు.

అంతరించిపోతున్న దేశవాళి రకాల సాగు

మన దేశంలోనే అత్యంత ప్రాచీనమైన వరి వంగడాలు నేటి హైబ్రిడ్ రకాల రాకతో అంతరించిపోయాయి. అత్యంత విలువైన పోషకాలను కలిగి మనిషికి మంచి ఆరోగ్యాన్నిచ్చే దేశవాళి వరి వంగడాలను సాగు చేస్తున్నారు. అందులో భాగంగా దేశవాళి రకాలైన నవారా, కుజీపటాలియం, బహురూపి, కాలాబాటి, అల్లుడు బియ్యం, చిట్టిముత్యాలు, కోతాంబరి, రత్నచోడి, కకోడి, బైరొడ్లు, రక్తశాలి, పూంగార్, జీరగసాంబ, పోక్కూర్, ఇల్లెపు సాంబ రకాల వరిని తన పొలంలో సాగుచేశారు. ఈ విత్తనాలను ఆసక్తిగల రైతులకు అందుబాటులో ఉంచారు.

ఎన్నో రోగాలకు మందుగా బియ్యం

దేశంలోని పురాతన వరి వంగడాల్లో ఎన్నో రకాల వ్యాధులను నయం చేసే గుణం ఉంది. ఎరుపు రంగులో ఉండే నవారా బియ్యం కేరళలో ఎక్కువగా ఔషధంగా ఉపయోగిస్తున్నారు. ఇందులో ఫైబర్ ఎక్కువగా ఉండి గ్లైకోమిన్ ఇండెక్స్ తక్కువగా ఉండడంతో షుగర్ వ్యాధిగ్రస్తులకు మేలు చేస్తుంది. పక్షవాతం బారిన పడిన వారికి కేరళలో భోజనం వండి పెట్టడంతో పాటు ఇదే అన్నంతో రోగి శరీరంపై మర్దన చేస్తారు. ఇది గాక ఇండియన్ వయాగ్రాగా పిలిచే నవారాను దేశవాళి రకాల్లో సంజీవనిగా పేరుంది. బియ్యం నుంచి మొలకలు రావడం దీని ప్రత్యేకత.

వరిలో కొత్త కొత్త ప్రయోగాలు

సాధరణంగా వరికి 90 శాతం నీటి అవరసం అవుతుంది. ఇదే విధానంతో రైతులందరూ ఇప్పటికీ వరిని సాగు చేస్తున్నాం. కానీ ఈయన తన మెట్ట పొలంలో ఆరుతడి పంటగా వరిని డ్రిప్ సాయంతో నీటినందిస్తూ సాగు చేస్తున్నారు. ఇప్పటికే బ్లాక్ రైస్, కూజీపటాలియా, బహురూపి రకాలను సాగు చేశాడు. తుపానులు, వరదలొచ్చినప్పుడు వరిమళ్లు నేలవాలి రైతుకు నష్టాన్ని కలిగిస్తున్న విషయం తెలిసిందే. అలాంటి సమస్య లేకుండా వెన్ను వాల్చని వరి వంగడమైన దేశవాళి రకం ఐదు అడుగులు పెరిగే బహురూపిని ప్రస్తుతం ఆయన పొలంలో కోతకొచ్చింది.



బ్లాక్ రైస్

కొలువు వదిలి.. కాడి పట్టి..

చందూల్ కుమార్‌రెడ్డి తిరుపతి ప్రాచ్య కళాశాలలో ఎంఏ తెలుగు, ఎంఏ సంస్కృతం, బీఈడీ చదివారు. సంస్కృత అధ్యాపకుడిగా రెండు దశాబ్దాలు పనిచేశారు. సుభాష్ పాలేకర్ స్ఫూర్తితో ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి పెంచుకున్నారు. దీంతో తాను పనిచేస్తున్న కొలువుకు స్వస్తి చెప్పి సేద్యంలోకి దిగారు. ఆయన క్రిమిసంహారక మందులు వాకుండా పూర్తిగా సేంద్రియ పద్ధతుల్లో వరి పంటను సాగు చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయం, దేశవాళి విత్తనాలు, దేశవాళి ఆవుల ద్వారా పంట సాగుపై సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తూ రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటికే ప్రకృతి సేద్యంలో ఇతని కృషిని గుర్తించి, పలు రాష్ట్రాల్లో ఇతనికి సత్కారాలు చేశారు.

జన్యు మార్పిడి విత్తనాలతో మానవాళికి ముప్పు

ప్రస్తుతం విత్తనాలను జన్యుమార్పిడి చేసి రూపొందించారు. దీంతో తక్కువ రోజుల్లో అధిక దిగుబడి వస్తుందని రైతులు హైబ్రీడ్ విత్తనాలను సాగు చేస్తున్నారు. అయితే పోషకాలు లేని వీటిని ఆహారంగా తీసుకోవడంతో మనిషి రోగనిరోధక శక్తి తగ్గుతోంది. జన్యుమార్పిడితో మానవాళికి ముప్పు కలుగుతుంది. అందుకే నేను దేశీయ విత్తనాల ఉద్యమాన్ని చేపట్టాలనే ప్రకృతి సేద్యానికి పూనుకున్నా.
– చందూల్‌కుమార్ రెడ్డి, ప్రకృతి రైతు

సేంద్రియంతోనే మనిషికి మనుగడ



మితిమీరిన రసాయనాల వాడి పంటలు సాగుచేసి వాటిని తినడంతో మనిషికి వ్యాధులు తప్పడం లేదు. మన తాతల కాలంలో వారు తిన్న ఆహారం శక్తివంతంగా ఆరోగ్యంగా ఉండేవారు. కాని నేడు ఆపరిస్థితి లేదు. నేడు రైతులు హైబ్రిడ్ వంగడాలను సాగుచేస్తున్నారు. మాశాఖ ద్వారా సేంద్రియ సేద్యంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రకృతి సేద్యం చేస్తున్న రైతులతో ఇతర రైతులను మమేకం చేస్తున్నాం. –సంధ్య, ఏఓ, పలమనేరు

రాజ్యాంగ స్ఫూర్తితో రాజ్యాంగ ఆమోద దినోత్సవం



నివాళులు అర్పిస్తున్న జేసీ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్ : రాజ్యాంగ స్ఫూర్తితో రాజ్యాంగ ఆమోద దినోత్సవం నిర్వహించుకుంటున్నట్లు జాయింట్ కలెక్టర్ విద్యాధరి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో రాజ్యాంగ ఆమోద దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అతిథిగా విచ్చేసిన జాయింట్ కలెక్టర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ భారత రాజ్యాంగానికి విశేష లక్షణాలున్నాయన్నారు. భారత దేశం ప్రపంచంలోకెల్లా అతి పెద్ద రాజ్యాంగాన్ని కలిగి ఉందన్నారు. అనంతరం జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ సిబ్బందితో జేసీ విద్యాధరి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో మోహన్ కుమార్, కలెక్టరేట్ ఏఓ కులశేఖర్, హౌసింగ్ పీడీ పద్మనాభం, సాంఘిక మైనారిటీ గిరిజన సంక్షేమ శాఖల అధికారులు రాజ్యలక్ష్మి, చిన్నారెడ్డి, మూర్తి, డీఎల్‌డీఓ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సప్తవర్ణ జిలుగు.. తూనీగ



సప్తవర్ణాల్లో మునిగి తేలుతున్నట్లు రివ్వున ఎగిరి వచ్చి చిటారుకొమ్మన వాలిన ఆ తూనీగ కనువిందుచేస్తోంది. సీతాకోక చిలుకను పోలిన ఈ తూనీగ అందమైన మాయలో పడదోస్తోంది. చూసిన ప్రతి హృది ప్రకృతి సోయగంలో పులకించడం తథ్యం. నగరి డిగ్రీకళాశాల మైదానం ఆనుకొని ఉన్న పొలాల్లో సీతాకోక చిలుకను పోలిన ఈ తూనీగ విహరించింది. సీతాకోక చిలుకను పోలివున్న ఈ తూనీగను పలువురు తమ సెల్‌ఫోన్లలో బంధించి, ఆనందించారు. – నగరి



క్లుప్తంగా

కాపు సంఘం జిల్లా అధ్యక్షుడిగా విజయబాబు


విజయబాబు

శ్రీరంగరాజపురం: జాతీయ కాపు సంఘం చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని 49 కొత్తపల్లిమిట్ట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ విజయబాబుని నియమించినట్లు జాతీయ కాపు సంఘ అధ్యక్షుడు కర్ణం మురళీకృష్ణమనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ కాపు సంఘం చిత్తూరు జిల్లా అధ్యక్షుడు విజయబాబు మాట్లాడుతూ గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో కాపులకు చేసిన సేవలను గుర్తించి తనని జిల్లా అధ్యక్షుడిగా నియమించడం ఆనందంగా ఉందన్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను కాపుల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా కాపు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. జిల్లా స్థాయిలో కాపు సంఘం శాశ్వత భవన నిర్మాణం కోసం భూమిని కేటాయించాలని అధికారుల దృష్టికి తీసుకువెళతానన్నారు.

సారా స్థావరాలపై విస్తృత దాడులు


ఊటను ధ్వంసం చేస్తున్న అధికారులు

చిత్తూరు అర్బన్: గుడిపాల మండలం రాసనపల్లి పరిసర ప్రాంతాల్లో మంగళవారం ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారులు విస్తృతంగా దాడులు చేశారు. ఈ దాడుల్లో 2,200 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు. ఈ ఊటకు సంబంధించిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశారు. అలాగే పేయనపల్లిలో సారా, గంజాయి అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాఖ అధికారులు జవహర్, శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై హత్యాయత్నం

చిత్తూరు అర్బన్: నగరంలో విగ్నేష్ ను కత్తితో పొడవడంతో మహేష్ అనే వ్యక్తిపై పోలీసులు మంగళవారం హత్యాయత్నం కింద కేసు నమోదు చేశారు. టూ టౌన్ ఎస్ఐ ప్రసాద్ కథనం మేరకు.. కైలాసపురానికి చెందిన విగ్నేష్ తాపీ కూలీగా పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి సంతపేట బ్రిడ్జి వద్ద ఇతను నిల్చుని ఉండగా అటువైపు వెళుతున్న తంగవేలు కాలనీకి చెందిన మహేష్ ను పలకరించాడు. వీరిద్దరికి గతంలోని పరిచయాలున్నాయి. అయితే ఇంటికి వెళుతున్న తనను ఎందుకు పిలిచావంటూ కత్తి మహేష్ కత్తి తీసి విగ్నేష్ ను పొడిచాడు. దీంతో తీవ్రంగా గాయపడిన బాధితుడిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పనిచేయని యంత్రాలు.. జీర్ణావస్థలో పడకలు.. తిరగని ఫ్యాన్లు.. అపరిశుభ్ర పరిసరాలు.. అంతంత మాత్రంగా ఉన్న ప్రయోగశాలలు.. చాలీచాలని సిబ్బంది.. నేటి ప్రభుత్వాస్పత్రుల్లో నెలకొన్న ఈ పరిస్థితులపై జిల్లా ఉన్నతాధికారి(కలెక్టర్) ప్రత్యేక దృష్టి సారించారు. పలు సమస్యలు గుర్తించారు. పరిష్కారానికి చర్యలు.. మెరుగైన వైద్యసేవల కల్పన దిశగా ముందడుగు వేశారు. ఆయన కృషి ఫలిస్తే సర్వజన ఆస్పత్రులు పేదలకు సంజీవని కానున్నాయి.



‘సర్వజను’లకు సంజీవని అయ్యేనా?

- జిల్లా, ఏరియా ఆస్పత్రుల్లో మార్పునకు కలెక్టర్ యత్నం
- సమస్యల పరిష్కారం దిశగా అడుగు
- మెరుగైన వైద్యం అందించేలా కసరత్తు

కాణిపాకం: ప్రభుత్వాస్పత్రులపై కలెక్టర్ దృష్టి సారించారు. లోటుపాట్లపై జిల్లావైద్య ఆరోగ్యశాఖ, వైద్యవిధాన పరిషత్ అధికారులతో జోరుగా చర్చలు సాగుతున్నాయి. రోగుల సమస్యలు పరిష్కారం.. మెరుగైన వైద్యసేవలే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. జిల్లాలోని ఆస్పత్రులను కలెక్టర్ విధిగా తనిఖీలు చేస్తున్నారు. ఈ తనిఖీలో ఆయన పలు సమస్యలు గుర్తిస్తున్నారు. ముఖ్యంగా వైద్యులు, సిబ్బంది, మందుల కొరతను గుర్తించారు. చిత్తూరులోని జిల్లా ప్రభుత్వాస్పత్రి, నగరి, కుప్పం, పలమనేరు, పుంగనూరు ఏరియా ఆస్పత్రులపై దృష్టి సారించారు. ఆ ఆస్పత్రుల్లో వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా చేసుకున్నారు.

జిల్లాలో ఒక జిల్లా ఆస్పత్రి, నాలుగు ఏరియా ఆస్పత్రులు, 8 సీహెచ్‌సీలు, 15 అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. వీటి పరిధిలో రోజూ 10 వేల వరకు ఓపీలొస్తున్నాయి. వీటిల్లో సరైన వైద్యం అందక చాలా మంది ప్రైవేటు ఆస్పత్రులు, తిరుపతి, తమిళనాడుకు పరుగులు పెడుతుంటారు. ఇక చిత్తూరు నగరం చుట్టూ జాతీయ రహదారి ఉండడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రమాదాల్లో గాయపడిన వారిని ఆస్పత్రులకు తీసుకొచ్చిన తర్వాత వైద్య సేవలు అందక మృత్యువాత పడుతున్నారు. వీటిని కట్టడి చేసి పేదల ప్రాణాలకు ఊపిరి పోయాలని కలెక్టర్ చొరవ చూపుతున్నారు.

మార్పునకు ప్రణాళికలిలా..

- జిల్లా ప్రభుత్వాస్పత్రిలోని ప్రసూతి విభాగం అభివృద్ధికి సుమారు రూ.12 లక్షల బడ్జెట్ అవసరం. ఇందుకుగాను ఎన్‌హెచ్ఎం నుంచి 50 శాతం, ఆరోగ్యశ్రీ ప్రోత్సాహక నిధి నుంచి 50 శాతం వినియోగించేలా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి.
- ల్యాబ్‌ల ముడిసరుకు, ఎస్ఎటీసీ బాధ్యతలు అపోలో మేనేజ్‌మెంట్‌కు అప్పగింత.
- పాత డీఈఐసీ భవనం కూల్చివేత.. దాని స్థానంలో కొత్తగా భవనం.
- పుంగనూరులో పెండింగ్ ఉన్న ఎంసీహెచ్ బ్లాక్ పనులకు అంచనా, ప్రతిపాదనలు.
- డ్యూటీ డాక్టర్లు సమయపాలనకు ఆదేశం
- రెఫర్ కేసులపై వివరాల సేకరణ
- ట్రూనాట్ యంత్రం అందజేత.
- యూఎస్‌జీ మెషిన్లు లేకపోవడంతో యూపీహెచ్‌సీల నుంచి తరలించాలని ఆదేశం..
- అంబులెన్స్ డ్రైవర్ల జీతాల చెల్లింపు, ల్యాబ్ ముడిసరుకు కొనుగోలుకు హెడీఎస్, ఆరోగ్యశ్రీ ప్రోత్సాహక నిధుల నుంచి చెల్లించాలని నిర్ణయం.
- కుప్పంలో ఓటీ టేబుల్, లైట్ల కొనుగోలుకు డీసీకి ఆదేశం.
- ఆరోగ్యశ్రీ ప్రోత్సాహక నిధి నుంచి మత్తు వైద్యునికి జీతాల చెల్లింపు. ఇవన్నీ చేకూరితే ఆస్పత్రుల్లో పలు మార్పులు రానున్నాయి.

ఆస్పత్రుల్లో సమస్యలివీ...

- పలు విభాగాల్లో డాక్టర్లు లేరు.. ట్రామాకేర్ లేదు.
- సిబ్బంది, మందులు, పరికరాలు, సామగ్రి కొరత వేధిస్తోంది.
- చాలా రకాల ఆపరేషన్లు జరగడం లేదు.
- రెఫర్ కేసులు అధికంగా ఉన్నాయి.
- పలు రకాల ల్యాబ్ టెస్టులు చేయడం లేదు.
- స్కానింగ్ నిర్వహణలో జాప్యం
- విధుల్లో వైద్యుల అలసత్వం.
- ఆస్పత్రుల్లో అపరిశుభ్రత రాజమేలుతోంది.

ఈ సమస్యలను పరిష్కరిస్తూ..నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు కలెక్టర్ గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు.

పేదలకు మంచి వైద్యమే లక్ష్యం



పేదలకు మంచి వైద్యం అందిచాలన్నదే కలెక్టర్ ఆశయం. ఈ మేరకు శాఖపరంగా పలు సమస్యలను పరిష్కరించడంతో పాటు అభివృద్ధి పనులు చేపట్టేందుకు లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ విషయాన్ని క్వాలిటీ అస్యూరెన్స్ కమిటీ సమావేశంలో కలెక్టర్ క్షుణంగా వివరించారు. ఆయన ఆదేశాల మేరకు పనిచేస్తాం. ఆస్పత్రుల రూపురేఖలు మారుస్తాం. పేదలకు మెరుగైన వైద్యం అందిస్తాం. –ప్రభావతి, డీసీహెచ్ఎస్, చిత్తూరు

మెరుగైన వైద్య సేవలు



పేదలకు నాణ్యమైన వైద్య అందాలని కలెక్టర్ పట్టుపడుతున్నారు. ఆయన ఇచ్చిన ఆదేశాలను తూచ తప్పకుండా పాటిస్తూ.. ఆస్పత్రులను మెరుగైన వైద్య సేవలు అందేలా చేస్తాం. ఇప్పటికే ఎక్కడెక్కడ లోపాలున్నాయనే విషయాన్ని గుర్తించాం. ఆస్పత్రులకు కావాల్సిన అవసరాలను ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. వైద్యులు సమపాలన పాటించేలా చూస్తాం. రెఫర్ కేసులను తగ్గిస్తాం. –ప్రభావతిదేవి, డీఎంఅండ్‌హెచ్ఓ, చిత్తూరు

నిషేధిత లాటరీ టికెట్ల విక్రయాలు అరికడతాం

- రూ.12.80 లక్షల టికెట్లు స్వాధీనం
- సీఐ శ్రీనివాసులు


మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసులు

పుంగనూరు: పట్టణంలో చట్టవిరుద్ధంగా నిర్వహిస్తున్న లాటరీ టికెట్ల విక్రయాలను అణచివేస్తామని సీఐ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం సీఐ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పట్టణంలోని సెంటర్‌లాడ్జిలో లాటరీ టికెట్ల విక్రయాలపై దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో పట్టణానికి చెందిన నజీర్‌బాషా, మహమ్మద్‌హుసేన్‌ను పట్టుకున్నామని తెలిపారు. వారి వద్ద నుంచి రూ.12.80 లక్షలు విలువ చేసే లాటరీ టికెట్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి, అరెస్టు చేశామన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నిషేధిత లాటరీలు విక్రయించే ముఠాను త్వరలో పట్టుకుంటామన్నారు. లాటరీలు చెన్నై, వేలూరు, గుడియాతం, చిత్తూరు ప్రాంతాల నుంచి ఇక్కడికి దిగుమతి చేస్తున్నారని, ఈ విషయమై జిల్లా ఎస్పీ, పలమనేరు డిఎస్పీ ప్రభాకర్‌తో చర్చించి, లాటరీల ముఠా క్రయ విక్రయాలను ఆపి వేసి, ముఠాను అరెస్టు చేస్తామని సీఐ స్పష్టం చేశారు. అలాగే కర్ణాటక మద్యం విక్రయాలు, పేకాట, కోడి పందెలు, సారా తయారీతో పాటు చోరీలు పూర్తిగా అరికట్టేందుకు ప్రజల సహకారం అందించాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలు ఎక్కడ జరిగినా తమకు సమాచారం అందించాలని ఆయన ప్రజలను కోరారు. అలాగే పట్టణంలో నేరాలను నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ తమ ఇళ్లకు, వ్యాపార సముదాయాలకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు.

బాబు పాలనలో రాజ్యాంగానికి విలువ లేదు


మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పుత్తూరు: నేటి చంద్రబాబు పాలనలో రాజ్యాంగానికి విలువ లేదని, అలాగే పేదలకు ఒరిగిందీ ఏమీలేదని మాజీ డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి అభిప్రాయపడ్డారు. మంగళవారం నారాయణస్వామి మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు ఇప్పటికే 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసినా ఆయన ఏనాడు రాజ్యాంగానికి విలువనిచ్చింది లేదన్నారు. జగనన్న పాలనలో ఇదే చంద్రబాబు ముఖ్యమంత్రి తల్లి అయిన విజయమ్మను తూలనాడినా, సాక్షాత్తు సీఎంను సైకో అని పదేపదే సంబోధించినా, సోషల్ మీడియా ద్వారా రకరకాల పోస్టులు పెట్టినా, నాడు వారిపై ఎలాంటి కేసులు పెట్టలేదని గుర్తు చేశారు. నేడు చంద్రబాబు అధికారంలోకి రాగానే పోలీసు వ్యవస్థను తన గుప్పిట్లో పెట్టుకుని, ప్రతి వైఎస్సార్ సీపీ నాయకుడు, కార్యకర్తపై అటెంట్ మర్డర్, రేప్, పీడీ వంటి తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆరోపించారు. ఇలా తప్పుడు కేసులు పెట్టి రిమాండ్‌కు పంపిస్తుంటే కోర్టులు సైతం ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. ఈవీఎంలను మేనేజ్ చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అరాచకాన్ని సృష్టిస్తోందని ఆరోపించారు. లోకేష్ రెడ్‌బుక్‌ను చేతిలో పెట్టుకొని, పోలీసులతో తప్పుడు కేసులు పెట్టిస్తున్నారని, వీటన్నింటికి సమాధానం చెప్పాల్సిన రోజు వస్తుందన్నారు. జగనన్న తన పాలనలో ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందేలా పనిచేశారన్నారు. నేడు చంద్రబాబు సంక్షేమం అనేమాటనే గాలికి వదిలేశారని, మ్యానిఫెస్టో ద్వారా ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను సైతం అమలు చేయడం లేదని ఆరోపించారు. పేదల కోసం ఆయన ఎలాంటి సంపద సృష్టించడం లేదన్నారు. ప్రైవేటు మద్యం పాలసీని తీసుకొచ్చి ఎమ్మెల్యేలు, మంత్రులు సంపదను దోచుకునేందుకు అవకాశం కల్పించారన్నారు. నేడు రాష్ట్రంలో వద్యం ఏరులై పారుతోందని, ప్రతి కళాశాల వద్ద ప్రతి షాపులో గంజాయి అందుబాటులో ఉందని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా చంద్రబాబు పేదలకు మంచి జరిగేలా పాలన సాగించాలని, లేనిపక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

అంబేడ్కర్‌కు అవమానం


ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న యువజన సంఘం నేతలు

నగరి : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్‌కు తీరని అవమానం జరుగుతోందని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ కార్యదర్శి డి.గోవిందస్వామి అన్నారు. మంగళవారం రాజ్యాంగ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బస్టాండ్ ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన మద్యం పాలసీలో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం పక్కనే రెండు మద్యం షాపులను కొత్తగా తెరిపించిందన్నారు. గుడికి బడికి జాతీయ నాయకుల విగ్రహాలకు వంద మీటర్ల దూరంలో మద్యం దుకాణాలు ఉండాలన్న నిబంధనను తుంగలో తొక్కి, రాజ్యాంగ నిర్మాతను అవమానిస్తున్నారన్నారు. ఈ దుశ్చర్యను ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం, దళిత్ పీపుల్ ఫ్రెండ్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. అంబేడ్కర్ విగ్రహం పక్కన ఉన్న వైన్ షాపులను అధికారులు వెంటనే తీయించకుంటే డిసెంబర్ 6న భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ మేరకు ఎక్సైజ్ అధికారులకు యువజన సంఘం నేతలతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దళిత్ పేపర్ ప్రింట్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ గజేంద్రన్, న్యాయవాది బాబు, అంబేడ్కర్ సంఘ నాయకులు సెల్వం, ఉమాపతి, సందీప్, తంగరాజు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో ఎస్ఈ కార్యాలయ మొదటి అంతస్తు నిర్మాణ పనులను ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు. గతంలో ఈఆర్వో కార్యాలయ నిర్మాణం కోసం రూ.57 లక్షలు మంజూరు చేశారని, ఆ మొత్తంతో మొదటి అంతస్తు నిర్మాణ పనులు పూర్తయ్యాక ఈఆర్వో, రూరల్ ఈఈ, ఎస్ఈ కార్యాలయంలో ఏదైనా ఒకదానిని ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్టు ఎస్ఈ చెప్పారు. అలాగే రూరల్ ఈఈ కార్యాలయ మరమ్మతులకు రూ.7 లక్షలు మంజూరైందన్నారు. అక్కడ పనుల ప్రారంభించారన్నారు. త్వరలో రూరల్ కార్యాలయాన్ని మార్చనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఈలు మునిచంద్ర, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మోటార్ల చోరీ

పలమనేరు: పట్టణానికి సమీపంలోని కౌండిన్య నదికి ఆనుకుని ఉన్న రైతుల మోటార్లు చోరీ జరిగిన సంఘటన మంగళవారం జరిగింది. బాధితుల కథనం మేరకు.. పలమనేరు క్యాటిల్‌ఫామ్ నుంచి కొంగోళ్లపల్లి వరకు నది పక్కన ఉన్న 3హెచ్‌పీ, 5 హెచ్‌పీ మోటార్లను సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. కొంగోళ్లపల్లికి చెందిన మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, రెడ్డెప్పరెడ్డి, సుబ్బయ్యకు చెందిన మోటార్లను దొంగలు చోరీ చేశారు. దీనిపై బాధిత రైతులు గంగవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భూసారంతో నాణ్యమైన దిగుబడులు


పాలేరులో ద్రవ జీవామృతం తయారీ విధానాన్ని రైతులకు చూపుతున్న వ్యవసాయాధికారులు

బంగారుపాళెం: రైతులు భూమిని సారవంతంగా పెట్టినప్పుడే నాణ్యమైన పంట దిగుబడులను సాధించేందుకు అవకాశం ఉందని జిల్లా వ్యవసాయ కేంద్ర సహాయ వ్యవసాయ సంచాలకులు నాగపద్మని అన్నారు. మండలంలోని పాలేరులో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, రైతులు వివిధ పంటలలో సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. పంటల సాగులో నేల స్వభావం, సాంద్రతను తెలియజేసే భూసార పరీక్షలు చేసి, తదనుగుణంగా జీవన ఎరువులను వినియోగించాలన్నారు. సాయిల్ హెల్త్ స్కీమ్‌పై అవగాహన కల్పించారు. చిత్తూరు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఉమ మాట్లాడుతూ, రబీలో సాగు చేసే పంటలను ఈ-పంటలో నమోదు చేసుకోవాలని, వ్యవసాయశాఖ పథకాల సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మామిడి పంట పూత దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉద్యానశాఖ అధికారి సాగరిక వివరించారు.మండల వ్యవసాయాధికారి చిట్టిబాబు మాట్లాడుతూ, రబీలో సాగు చేసే వరి పంటకు డిసెంబర్ నెలాఖరులోపు ఎకరాకు రూ.84 చొప్పున ప్రీమియం చెల్లించి పంటల బీమా పథకంలో నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అభింకా గాంధీ, జ్ఞానశేఖర్ ద్రవ జీవామృతం తయారీ విధానాన్ని ప్రదర్శనపూర్వకంగా రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఈఓ సాదరయ్య, ఏఎఓలు పుష్పాంజలి, ఆనంద్‌రాజ్, రైతులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DIRECT FINAL YEAR

Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry.9381287629

Wanted

తిరుపతిలో డైరీ నందు పనిచేయుటకు ల్యాబ్ అసిస్టెంట్(10th), గార్డెన్ , మాన్సన్, హెల్పర్ (7th) కావలెను. జీతం: 12,800 to 10,800, PF,ESI కలదు. ✆ 7799777689.

ప్రముఖ సంస్థలో పనిచేయుటకు హెల్పర్స్ కావలెను. అర్హత: డిప్లొమో, ITI, డిగ్రీ, డ్యూటీ: 12 గం., జీ:16,000, భోజన వసతి కలదు. ✆ 8074434160, 9951393311.

Smiles Pharmacy లో పనిచేయుటకు Pharmacist అర్జెంటుగా కావలెను. Q: Any Degree, Exp:Min.3 to 5 Yrs, బైరాగిపట్టెడ, కేశవాయని గుంట, తిరుపతి, 8331090555.

ప్రభుత్వ పాఠశాలల్లో Outsourcing పద్ధతిలో పనిచేయుటకు ఒకేషనల్ టీచర్లు, కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. అన్ని రకాల కాంట్రాక్ట్ ఉద్యోగాలకు సంప్ర: 9848771117, 9949942245.

రాధాకృష్ణ స్టీల్, తిరుపతిలో పని చేయుటకు అకౌంటెంట్ (Tally తెలిసిన వారు)కావలెను. ఆకర్షణీయమైన జీతం. సంప్రదించండి సెల్: 9866301764.

స్పాట్ జాయినింగ్.మా జాబ్ సోర్సింగ్ ఏజెన్సీలో టెలీకాలర్/Comp.Op./ ఆఫీసర్ ఇన్ ఛార్జ్ జాబ్స్ కలవు.(Only Female), జీ: 12,000 to 18,000, Age: 18 to 35. ✆ 96032 55559.

AP & TG ప్రముఖ TV చానల్లో మీ జిల్లాలో పనిచేయుటకు డిస్ట్రిక్ట్ ఇన్‌చార్జ్, నియోజకవర్గ ఇన్‌చార్జిస్, మండల రిపోర్టర్స్ కావలెను. సంప్ర॥ 94939 47007

కన్సల్టెన్సీ కాదు. VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు,RMP&డాక్టర్స్ కావలెను. జీ.15- 40 వేలు. ఫ్రీ రూం+ భోజనం. HYD. 9182280297

రియల్‌ఎస్టేట్Co.HYD,కోకాపేట్, శంకర్‌పల్లిలో విల్లాస్/ప్లాట్స్ సేల్స్‌కై మార్కెటింగ్ Exe. జీ/కమీషన్+2వీలర్+రూం+ఫ్రీ. Age: 32, నెలకు రూ. ఫ్రెష్/Exp. Ph: 7416396781

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులకు కోరడమైనది. ప్రకటనదారుల తీరుపై రోజు క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వారాంతాల్లో ప్రకటనకు రూ. 375/- ప్రతి ప్రకటనపై అదనపు లైనుకు రూ.:90/- G.S.T 5% అదనం

CONTACT : 9440166091, 9951602970

ఇసుకింకరులపై సమర శంఖం

- అక్రమార్కులను అడ్డుకున్న మొరం గ్రామస్తులు
- ఏమాత్రం స్పందించని సంబంధిత అధికారులు
- తామే పహారా ఉంటామంటున్న గ్రామస్తులు
- ప్రశాంతంగా మారిన మొరం పెద్ద చెరువు


మొరం పెద్ద చెరువు

పలమనేరు: సహజ వనరుల దోపిడీపై కడుపుమండిన గ్రామస్తులు తమ చెరువును తామే రక్షించుకోవాలని నడుం బిగించారు. గ్రామస్తులు ఇసుకాసురులను చెరువులోకి రానీయకుండా ప్రహారా కాస్తున్నారు. దీంతో రెండు రోజులుగా పలమనేరు మండలంలోని మొరం పెద్ద చెరువులో జేసీబీ శబ్దాలు, ట్రాక్టర్లు కనిపించలేదు. ఈ చెరువులో వేలాది లోడ్ల ఇసుక, బంకమట్టిని అధికారపార్టీ పేరు చెప్పి కొందరు మూడు నెలలగా తరలించిన విషయం తెలసిందే. దీనిపై సాక్షి దినపత్రికలో ‘మా జీవధారకు మేమే రక్ష’ అనే శీర్షికన సోమవారం కథనం వెలువడింది. దీనిపై సంబంధిత శాఖలైన మైనింగ్, ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖలు అసలు పట్టించుకోలేదు. కానీ గ్రామస్తులందరూ ఏకమై చెరువులో ఇసుక తవ్వకాలు చేపట్టరకూడదంటూ గట్టిగా భీష్మించారు. ఫలితంగా రెండు రోజులుగా చెరువులో బంక మట్టి, ఇసుక తవ్వకాలు ఆగాయి. మొరం పెద్ద చెరువు సైతం ప్రశాంతంగా మారింది. ఆ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలే ఇసుకాసురులను అడ్డుకున్న విషయం తెలిసిందే. సాక్షి దినపత్రికలో వచ్చిన కథనంపై స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి సైతం ఇలాంటి అక్రమాలకు తావులేదని, తనకు అనవసరంగా మరక అంటించొద్దని ఆపార్టీ శ్రేణులకు గట్టిగా హెచ్చరించినట్టు తెలిసింది. కానీ స్థానిక ఎమ్మెల్యే మనషులుమంటూ కొందరు ఇచ్చిన హామీతోనే అక్కడి చెరువులో ఇసుక దందా ఇన్నాళ్లు సాగినట్టు తేటతెల్లమైంది. దీంతో ఆయన సైతం తన పేరుకు వాడుకుంటూ ఇసుక దందా చేస్తున్న వారిపై ఆరా తీస్తున్నట్టు ఆపార్టీ శ్రేణుల్లోనే కలకలం మొదలైంది. ఇంత జరిగినా సంబంధిత శాఖలకు చెందిన అధికారులు దీని గురంచి పట్టించుకోకపోవడంపై మొరం గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరు వచ్చినా రాకపోయినా తాము ఇకపై చెరువులో మట్టిని, ఇసుకను తోడేందుకు ఎవరొచ్చినా వదిలి పెట్టే సమస్యేలేదని గట్టిగా చెబుతున్నారు.

యువత జాతీయస్థాయిలో రాణించాలి


బహుమతులు స్వీకరిస్తున్న విద్యార్థులు

- ఉత్సవంగా యువ ఉత్సవ్ కార్యక్రమం

చిత్తూరు కలెక్టరేట్: యువత జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చాటి, రాణించాలని నగర మేయర్ అముద అన్నారు. మంగళవారం నగర సరిహద్దులోని ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాలలో నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో యువ ఉత్సవ్ కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న మేయర్ మాట్లాడుతూ యువ ఉత్సవ్ లాంటి కార్యక్రమాలు నేటి యువతరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఇలాంటి పోటీలు విద్యార్థుల్లోని ప్రతిభా పాటవాలను వెలికి తీసేందుకు దోహదం చేస్తాయన్నారు. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందిస్తాయని తెలిపారు. యువతరం సానుకూల దృక్పథంతో ఈ పోటీ ప్రపంచంలో రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. యువ ఉత్సవ్ లాంటి కార్యక్రమాలను యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఉరకలెత్తే ఉత్సాహం చూపించే యువతను చూస్తే తన చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయన్నారు. ఎస్వీ సెట్ కళాశాల డైరెక్టర్ సుదర్శన్ మాట్లాడుతూ జీవితంలో ఎదురయ్యే గెలుపోటములను విద్యార్థులు సమానంగా స్వీకరించాలని చెప్పారు. చిత్తూరు జిల్లా యువత రాష్ట్ర, జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటాలన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.మోహన్ బాబు మాట్లాడుతూ స్వామి వివేకానంద స్ఫూర్తితో యువత తాము ఎంచుకున్న లక్ష్యాలను సాధించాలని హితవు పలికారు. నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి బి.ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ యువ ఉత్సవ్ లో ఇండియా 2047 నాటికీ దేశం ప్రపంచానికి దిక్సూచిలా ఉండాలన్నారు. అందుకు ఇలాంటి కార్యక్రమాలు మరింత దోహదపడతాయన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కల్చరల్ కో ఆర్డినేటర్ స్వాతి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కన్నతల్లిని కాదని.. ప్రియుడి వెంట నడిచి..


ప్రేమ వివాహం చేసుకున్న జంట

రొంపిచెర్ల: ప్రేమ వివాహం వద్దని ప్రియుడు కట్టిన తాళిబొట్టును తెంచినా ఆ యువతి కన్నతల్లిని ఎదిరించి ప్రేమికుడి వెంట వెళ్లిన సంఘటన రొంపిచెర్ల మండలంలో మంగళవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. గానుగచింతకు చెందిన యువకుడు రెడ్డెప్ప (21), తిరుపతి జిల్లా చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేటకు చెందిన చిట్టి ప్రసన్న(19) అన్నమ్మయ్య జిల్లా పీలేరులో డిగ్రీ చదువుతున్నారు. వీరిద్దరూ ఐదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. అయితే చిట్టి ప్రసన్నకు వివాహం చేయాలని తల్లిదండ్రులు నిర్ణయించారు. దీంతో చిట్టి ప్రసన్న ఇంటి నుంచి మంగళవారం ఉదయం రొంపిచెర్లకు చేరుకుని జరిగిన విషయం ప్రియుడు రెడ్డెప్పకు చెప్పింది. దీంతో వారిద్దరూ కట్టకింద శివాలయంలో వివాహం చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న చిట్టి ప్రసన్న తల్లి కుమార్తె మెడలో ఉన్న తాళిబొట్టును తెచ్చి ఇంటికి రావాలని కుమార్తెను పిలిచింది. అయితే దీనికి కుమార్తె అంగీకరించలేదు. దీంతో ఈ పంచాయితీ రొంపిచెర్ల పోలీసుస్టేషన్‌కు చేరింది. ఎస్ఐ సుబ్బారెడ్డి ప్రేమికులను విచారించారు. పోలీసుల విచారణలో ప్రేమికురాలు తన ఇష్ట ప్రకారమే వివాహం చేసుకున్నాని తెలిపింది. తాను మేజర్‌నని తనకు తన భర్త కావాలని తెగేసి చెప్పింది. దీంతో పోలీసులు చేసేదేమీ లేక వారిని కలసి ఉండమని చెప్పారు. దీంతో ఇరువురు గానుగచింతకు చేరుకున్నారు.